సాక్షి అనకాపల్లి

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023




తప్పిన ప్రమాదం

అనకాపల్లి హైవేపై ఉమ్మలాడ కూడలి వద్ద రెండు టూరిస్టు బస్సులు ఢీకొన్నాయి. ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. 8లో



వేసవి శిబిరాల ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్ : ఈకోర్స్ వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిబిరాలను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి ప్రారంభించారు.



అనకాపల్లి టౌన్: రాగల నాలుగు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, ఈనెల 7న 12 మిల్లీమీటర్ల మోస్తరు వర్షపాతం నమోదయ్యే అవకాశముందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి సోమవారం పేర్కొన్నారు.

అనకాపల్లి
ఇఫ్తార్ (మంగళ) సహర్ (బుధ)
6-14 4-34
నర్సీపట్నం
6-17 4-33

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

సన్మార్గంలో నడవడమే బౌద్ధం



మాట్లాడుతున్న బౌద్ధ బిక్షువు వేణుగోపాల్ బాంతే

అనకాపల్లి టౌన్: దేశంలోని ప్రతి ఒక్కరూ బౌద్ధ మతాన్ని ఆశ్రయించాలని విశాఖ బౌద్ధ బిక్షువు వేణుగోపాల్ బాంతే అన్నారు. మండలంలోని శంకరం బొజ్జన్నకొండ వద్ద బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. చెడు అలవాట్లను పక్కన పెట్టి సన్మార్గంలో నడవడమే బౌద్ధమని పేర్కొన్నారు. జిల్లాలో బౌద్ధ మతంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సైతం బౌద్ధ మతంలో చేరారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు మాటూరు శ్రీనివాసరావు, బాలరాజు, వై.హరిబాబు, శంకరప్రసాద్, పండు రామారావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



బహుమతులు సాధించిన బాలికలు

అచ్యుతాపురం (అనకాపల్లి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొన్న అచ్యుతాపురం మండలంలోని శ్రీరామా బాల్ బ్యాడ్మింటన్ క్రీడా శిబిర క్రీడాకారులను అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం అభినందించారు. గత నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న ఎం.రాధాస్రవంతి, హైమావతి, హిమబిందులను శ్రీరామా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు మాట్లాడుతూ ఇక్కడి శిబిరంలో శిక్షణ పొందిన ముగ్గురు ఏపీ తరపున పాల్గొని జాతీయ స్థాయిలో మూడో స్థానం పొందారని తెలిపారు. రాధా స్రవంతికి స్టార్ ఆఫ్ ఇండియా బెస్ట్ ప్లేయర్ అవార్డు దక్కిందని చెప్పారు.

నర్సీపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ రాజీనామా



మున్సిపల్ కమిషనర్‌కు రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న వైస్ చైర్మన్ నర్సింహమూర్తి

నర్సీపట్నం: మున్సిపల్ వైస్ చైర్మన్ పదవికి నాలుగో వార్డు కౌన్సిలర్ గొలుసు నర్సింహమూర్తి సోమవారం రాజీనామా చేశారు. వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ కమిషనర్ కనకారావుకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహమూర్తి విలేకరులతో మాట్లాడుతూ పార్టీ నిర్ణయానికి కట్టుబడి స్వచ్ఛందంగా తన పదవికి రాజీనామా చేశానని చెప్పారు. తాను వైస్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంలో రెండేళ్ల తర్వాత మరొకరికి అవకాశం కల్పిస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ప్రకటించారన్నారు. అప్పటి మాట ప్రకారం రాజీనామా చేశానన్నారు. కౌన్సిలర్‌గా తన వార్డు అభివృద్ధికి కృషి చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాల్లో తన వంతు పాత్ర పోషిస్తున్నానన్నారు. ఆయన వెంట రెండో వైస్ చైర్మన్ తమరాన అప్పలనాయుడు, కౌన్సిలర్లు మాకిరెడ్డి బుల్లిదొర, బయపురెడ్డి చినబాబు, వీరమాచినేని జగదీశ్వరి, బోడపాటి సుబ్బలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు ఏకాశివ, కోఆప్షన్ సభ్యులు షేక్ రోజా పాల్గొన్నారు.

పాలనా వికాసం

- గ్రామీణులకు చేరువైన పరిపాలన
- కొత్త జిల్లా ఏర్పాటుతో అధికార వికేంద్రీకరణ
- అధికారుల 'స్పందన' అపూర్వం
- 95 శాతం అర్జీల పరిష్కారం
- ప్రగతి పనులు వేగవంతం
- అనకాపల్లి జిల్లా ఏర్పడి నేటికి ఏడాది



స్పందనకు అర్జీదారుల వెల్లువ, (ఇన్‌సెట్) వికలాంగుల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్న జేసీ (ఫైల్)

సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి జిల్లా ఆవిర్భవించి మంగళవారం నాటికి ఏడాది పూర్తయింది. అధికార వికేంద్రీకరణతో గ్రామీణ ప్రాంతాల వారికి పాలన చేరువైంది. తమ సమస్యలను అధికారుల దృష్టికి సులువుగా తీసుకువెళ్లడం, అవి సత్వరం పరిష్కారం కావడం సాధ్యమైంది. దీంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. పార్లమెంటు స్థానాన్ని ఒక జిల్లాగా ఏర్పరిస్తే పాలనా సౌలభ్యం ఉంటుందని, ప్రభుత్వ ఆశయాలను త్వరగా నెరవేర్చవచ్చన్న సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సంస్కరణలు ఫలించాయి. కొత్త జిల్లాలో ప్రగతి, పురోగతి సాధ్యమైంది. పాయకరావుపేట, నర్సీపట్నం, మాడుగుల, చోడవరం ప్రజలు గతంలో సుమారు 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించి, విశాఖ వచ్చి అధికారులకు తమ సమస్యలు చెప్పుకునేవారు. ఇప్పుడు చెంతనే జిల్లా కేంద్రం ఉండడంతో సులువుగా అధికారులను కలవగలుగుతున్నారు.

తక్షణ 'స్పందన'

కొత్త జిల్లా కేంద్రం చేరువ కావడంతో 'స్పందన'లో విన్నవించుకున్న సమస్యలు తక్షణం పరిష్కారం అవుతున్నాయి. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏడాదిపాటు నిర్వహించిన 52 స్పందన కార్యక్రమాల్లో 95 శాతం సమస్యలు పరిష్కారమై అనకాపల్లి రాష్ట్రంలోనే టాప్ టెన్ జిల్లాల జాబితాలో నిలిచింది. కొత్త జిల్లా ఏర్పడ్డాక సంవత్సర కాలంలో మొత్తం 17,098 అర్జీలు స్వీకరించగా వీటిలో 354 మినహా అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయి. 1716 ఫిర్యాదులు రీఓపెన్ చేశారు. పోలీస్ స్పందనలో ఏడాదిలో 1292 ఫిర్యాదులు స్వీకరించగా..1124 పరిష్కారం అయ్యాయి. 84 ఫిర్యాదుల మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి.



జగనన్న కాలనీలపై అధికారుల ప్రత్యేక దృష్టి

చకచకా భూముల రీ సర్వే

ఫేజ్-1లో 147 గ్రామాల్లో భూముల రీసర్వే పూర్తయింది. మరో 100 గ్రామాల్లో రీసర్వే జరుగుతోంది. 430 మంది సర్వేయర్లతో డ్రోన్ సర్వే దాదాపుగా వంద శాతం పూర్తి చేసి రాష్ట్రంలోనే టాప్-5లో అనకాపల్లి జిల్లా నిలిచింది. స్పందనలో ఎక్కువగా నమోదయ్యే రెవెన్యూ సమస్యలకు రీసర్వేతో శాశ్వత భూపరిష్కారం లభిస్తోంది.

హౌసింగ్‌లో 10 వేల నిర్మాణం పూర్తి

జిల్లాలో 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకంలో 10 వేల ఇళ్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గృహనిర్మాణాల్లో 6వ స్థానంలో నిలిచింది. ఉగాది లక్ష్యం 10,760 కాగా మార్చి నెలాఖరు నాటికి పది వేల ఇళ్లు పూర్తయ్యాయి.

శాంతిభద్రతల పరిరక్షణ

ఈ ఏడాదిలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్టపడింది. ఎస్పీ గౌతమి సాలి రోడ్డు ప్రమాదాల నివారణతోపాటు చోరీలు సంభవించకుండా క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. సైబర్ నేరాలు, దిశ చట్టంపై కళాశాలలు, స్కూళ్లు, ప్రధాన కూడళ్ల వద్ద సంచార వాహనాలతో అవగాహన కల్పిస్తున్నారు. అనకాపల్లి మండలం కోడూరు గ్రామంలో రెండుదఫాలు 1,93,384 కేజీల గంజాయి దహనం చేశారు. జిల్లా పోలీస్ వాట్సాప్ నంబర్‌కి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా మొబైల్ రికవరీ మేళా నిర్వహించి, బాధితులకు రెండు విడతల్లో రూ.48 లక్షల విలువైన 241 మొబైల్స్‌ని అందజేశారు. గత మూడేళ్లలో రోడ్డు ప్రమాదాలు సంభవించడానికి గల కారణాలను మ్యాపింగ్, డ్రోన్ టెక్నాలజీ ద్వారా గుర్తించారు. 8 ప్రమాదాల కన్నా ఎక్కువగా జరిగిన 37 బ్లాక్ స్పాట్స్‌ను మొదటి ఫేజ్‌లో గుర్తించి.. అక్కడ ప్రమాదలకు గల కారణాలు విశ్లేషించి.. సేఫ్టీ కమిటీ ఆధ్వర్యంలో పలు జాగ్రత్తలు తీసుకున్నారు. ఫలితంగా గత మూడు నెలల్లో 10 శాతం మేర రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి.



విజన్ పెరిగింది.. సూపర్‌విజన్ సాధ్యమైంది..

'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సాక్షి, అనకాపల్లి: వికేంద్రీకరణతో జిల్లా పాలనలో పురోగతి సాధ్యమైందని, 'అనకాపల్లి' అభివృద్ధి బాట పట్టిందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. జిల్లా పరిధి తగ్గడంతో సులువుగా అవగాహన ఏర్పడిందని, పర్యవేక్షణ సులభసాధ్యమైందని.. పర్యవసానంగా ప్రజలకు మెరుగైన ఫలితాలు అందించగలిగామని ఆయన చెప్పారు. కొత్త జిల్లా ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి'తో కలెక్టర్ మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..

సచివాలయాలు ఉండడంతో స్పందనలో వెల్ఫేర్ గ్రీవెన్స్ తగ్గాయి. సివిల్ వివాదాలపై ఫిర్యాదులే ఎక్కువగా వచ్చాయి. జిల్లాల వికేంద్రీకరణతో అధికార యంత్రాంగం పర్యవేక్షణ మరింత పెరిగింది. కొత్తగా జిల్లా ఏర్పాటై అడ్మినిస్ట్రేషన్ సెటప్ మొత్తం పూర్తయ్యేందుకు 6 నెలల సమయం పట్టింది. అధికారులతో నెలవారీ సమీక్షలు చేస్తూ ప్రజలకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. రోడ్డు సేఫ్టీ, ఉమెన్ సేఫ్టీ వంటి వాటిపై ప్రధానంగా దృష్టి సారించాం. ఇదే తరహాలో రెండో ఏడాది పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తాం.

ఉపాధిలో రెండో స్థానం

జిల్లాలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో లక్ష్యాన్ని మించి కోటి 7 లక్షల పనిదినాలు కల్పించాం. రాష్ట్రంలో అనకాపల్లి జిల్లా రెండో స్థానంలో ఉంది. లక్ష్యాన్ని వందశాతం పూర్తిచేసి.. అదనంగా కూడా పనిదినాలు కల్పించడం జరిగింది.

హెల్త్ విభాగంలో టాప్-5లో..

ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయిల్ రన్, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా, డిస్ట్రిక్ట్ ఆసుపత్రుల ద్వారా వైద్యసేవలందించడంతో పాటు ఆల్ పారామీటర్స్‌లో టాప్-5లో అనకాపల్లి జిల్లా నిలిచింది. గర్భిణులకు నిరంతరం హెల్త్ చెకప్ చేస్తూ, మెటర్నిటీ డెత్ రేట్ తగ్గించడంలో, బాలింతలకు పౌష్టికాహారం అందించడంలో, సచివాలయాల ఏఎన్ఎం ద్వారా ప్రజలకు ఫీవర్ సర్వే, ఇతర వైద్యసదుపాయల్లో మెరుగైన సేవలందిస్తున్నాం.

- 'నాడు-నేడు' ద్వారా విద్య, వైద్య విభాగాల్లో భవనాల ఆధునికీకరణ, మౌలిక వసతుల కల్పనలో మన జిల్లా పదో స్థానంలో ఉంది. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో జిల్లా రెండో స్థానంలో ఉంది.
- జిల్లాకు ఒక మెడికల్ కళాశాల ఉండాలన్న ముఖ్యమంత్రి ఆశయాన్ని నెరవేరుస్తూ మాకవరపాలెం మండలంలో త్వరితగతిన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పెట్రో యూనివర్సిటీని కూడా మరో 24 నెలల్లో పూర్తి చేస్తాం.
- 1,116 హెక్టార్లలో ఉప్పునీటి రొయ్యల పెంపకం సాగుతోంది. మంచినీటి చేపల సాగు అనుకూల విస్తీర్ణం 381 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 102 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. జిల్లాలో 6 వేల మెట్రిక్ టన్నుల రొయ్యల ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుతం ఆక్వానోజేషన్‌లో జిల్లా టాప్ 1లో ఉంది.

దొంగ రిజిస్ట్రేషన్ రద్దు



మాది అనకాపల్లి మండలం రేబాక గ్రామం. సర్వే నంబర్ 104,37లో నాకు వారసత్వంగా జిరాయితీ భూమి ఉంది. నా తండ్రి పని కోసం విదేశాల్లో ఉంటున్నారు. ఈ సమయంలో కొంతమంది ఆక్రమణదారులు దొంగ రిజిస్ట్రేషన్ చేసి భూమి కాజేశారు. కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం జరిగే స్పందనలో అర్జీ సమర్పించుకున్నా. అర్జీపై స్పందించిన అధికారులు విచారణ చేసి దొంగ రిజిస్ట్రేషన్ రద్దు చేయడంతో మా భూమి మాకు దక్కింది.

–జి.ప్రసాద్, రేబాక గ్రామం, అనకాపల్లి

సౌకర్యవంతం



జిల్లా ఏర్పాటు చేయడం వలన సౌకర్యవంతంగా ఉంది. గతంలో కలెక్టరేట్‌కు సమస్యలు నివేదించేందుకు వెళ్లాలంటే ఇబ్బందులతోపాటు వ్యయప్రయాసలకు లోనవ్వాల్సివచ్చేది. ఇటీవల మా గ్రా మంలో సమగ్ర భూ రీసర్వే సవ్యంగా జరగకపోవడంతో గ్రామానికి చెందిన ప్రజలందరం కలిసి కలెక్టరేట్ స్పందనలో అర్జీ ఇచ్చాం. రీసర్వేపై పరిశీలన చేపట్టారు. సకాలంలో సమస్యలు పరిష్కారమయ్యేందుకు కొత్త జిల్లా దోహదపడుతుంది.

–కె.లోవరాజు, జి.భీమవరం, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్, కశింకోట

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

- పక్కాగా మత్తు పదార్థాల నిరోధం
- అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు
- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశం

తుమ్మపాల: మాదకద్రవ్యాల సాగు, రవాణా, అమ్మకాలపై నిఘా పెంచుతూ ఉక్కుపాదం మోపాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నిరోధక శాఖ రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ గౌతమి సాలితో కలిసి ఆయన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలన్నారు. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ఇటువంటి పదార్థాలు విక్రయించే షాపులపై నిఘా పెట్టి కేసులు పెట్టాలన్నారు. మైనర్లకు మద్యం, పొగాకు గంజాయి విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదు చేసేందుకు 14500 టోల్‌ఫ్రీ నంబర్లు ప్రతి చోట ప్రదర్శించాలన్నారు. రైలు, బస్సులలో మత్తు పదార్థాలు గుర్తించిన వెంటనే ఆయా సిబ్బంది పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మత్తుకు బానిసలైన వారు ఆ ఊబి నుంచి బయటపడేందుకు రీహేబిలిటేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ గౌతమి సాలి మాట్లాడుతూ మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల విక్రయాలపై పూర్తి నిఘా ఉంచాలన్నారు. జిల్లాలో గంజాయి పంటను సమూలంగా నాశనం చేశామన్నారు. ముఖ్యంగా నర్సీపట్నం, గొలుగొండ, కేడీపేట ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్, కస్టమ్స్ జాయింట్ కమిషనర్ మహమ్మద్ అలీ, ఆర్డీవోలు చిన్నికృష్ణ, జయరాం, డీఎంహెచ్‌వో హేమంత్, వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు, అదనపు ఎస్పీ క్రైం పి.సత్యనారాయణ, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద ప్రమాదం

- పూడిమడక వాసి మృతి
- బాక్లెయిన్ ఢీకొనడంతో మృతి చెందాడని ప్రచారం
- నడుమ దిగువ భాగాలు కాలిపోవడంపై అనుమానాలు
- ఆర్‌సీఎల్ వద్ద బంధువులు, గ్రామస్తుల ఆందోళన



మృతి చెందిన పెంటయ్య

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం సెజ్‌లో కొద్దిపాటి ఉద్రిక్తత చోటు చేసుకుంది. సెజ్‌లోని ఆర్‌సీఎల్ కంపెనీలో పనిచేస్తున్న కొవిరి పెంటయ్య(37) మృతి చెందడంతో ఆయన బంధువులు, పూడిమడక వాసులు ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద ఆందోళన చేపట్టారు. బాధితుడి కుటుంబానికి న్యాయం చేయాలని ఒక వైపు ఆందోళన జరుగుతుండగా, పోలీసులు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నారు. వివరాలివి... అచ్యుతాపురం మండలంలోని పూడిమడకకు చెందిన కొవిరి పెంటయ్య(37) ఆర్‌సీఎల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈయన్ని పొక్లెయిన్ ఢీకొనడంతో మృతి చెందాడని ముందుగా ప్రచారం జరిగింది. మృతి చెందిన పెంటయ్య కుటుంబానికి న్యాయం చేయాలని పూడిమడక ఎంపీటీసీ వాసుపల్లి శ్రీనివాస్ పద్మావతి, సూరాడ ధనరాజ్ తదితరులు కంపెనీ ముందు ఆందోళన ప్రారంభించారు. వీరిని శాంతింపజేసేందుకు పోలీసులు చర్చలు జరిపారు. మృతుని కుటుంబానికి రెండు కోట్ల రూపాయిల పరిహారం, మృతుని భార్యకు ఉద్యోగం ఇవ్వాలని సాయంత్రం వరకూ బైఠాయించారు.



ఆర్‌సీఎల్ కంపెనీ వద్ద ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, పూడిమడక వాసులు

అనుమానాస్పదంగా మృతి...

పెంటయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పొక్లెయిన్ ఢీకొనడం వల్ల పెంటయ్య మృతి చెందలేదని, ఖచ్చితంగా బాయిలర్ వంటి వేడి పరిసరాల్లో కాలిపోవడం వల్లే మృతి చెందాడానికి నిరసనకారులు ఆరోపించారు. దీనిపై యాజమాన్యం స్పష్టత ఇవ్వలేదు. పరిశ్రమ వద్ద పరిస్థితి అదుపు తప్పకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మృతుని నడుమ దిగువ భాగం చూస్తే కాలిపోయినట్టుగా కనిపించడంతో పెంటయ్యకు జరిగిన ప్రమాదంపై యాజమాన్యం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది. మృతుని కుటుంబానికి న్యాయబద్ధమైన పరిహారం ఇచ్చే వరకూ నిరసన ఆపేది లేదని మృతుని కుటుంబీకులు పేర్కొన్నారు.

ఇద్దరు నాయకులపై టీడీపీ వేటు -8లో

తొలి రోజు ప్రశాంతం

- పదో తరగతి పరీక్షలకు 99.36 శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



జెడ్.కొత్తపట్నంలో పరీక్షకు వచ్చిన దివ్యాంగ విద్యార్థి

అనకాపల్లి టౌన్: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 111 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 22,293 మంది రెగ్యులర్ విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 22,182 మంది హాజరయ్యారు. 111 మంది గైర్హాజరయ్యారు. 241 మంది ప్రైవేటు విద్యార్థులకుగాను 207 మంది పరీక్షకు హాజరుకాగా 34 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 99.36 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో వెంకటలక్ష్మమ్మ వెల్లడించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని విద్యాశాఖాధికారులు ముందుగానే పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 8.45 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులను గేటు వద్దనే పూర్తి స్థాయిలో తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. సచివాలయ మహిళా పోలీసులను కేంద్రాల వద్ద విధుల్లో ఉంచారు. బ్యాగులు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. 10వ తరగతి ఓపెన్ స్కూల్ విద్యార్థులకు 4 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 647 మందికి 588 మంది పరీక్ష రాశారు. ఓపెన్ ఇంటర్మీడియట్ విద్యార్థులకు 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 1,655 మంది 1,501 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు.



రావికమతం టి.అర్జాపురం వినాయక ఆలయంలో పరీక్షకు వెళ్లే ముందు విద్యార్థుల పూజలు



సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేసి ఎస్పీ గౌతమి సాలి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ బి.విజయభాస్కర్ నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



యలమంచిలిలో పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న పదో తరగతి విద్యార్థులు

అప్పన్నకు విశేషంగా తిరువీధి



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం సాయంత్రం మాడ వీధిలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని తిరువీధిలో దర్శించుకుని ఆశీస్సులు పొందారు. కాగా కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం విశేష హోమాలు, గ్రామ బలిహరణం చేపట్టారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి పండిత సదస్యం, సాయంత్రం సర్వజన మహోరంజని వాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు. మంగళవారం స్వామివారి దర్శనాలు ఉదయం 8 గంటల రాత్రి 7 గంటల వరకే ఉంటాయని అధికారులు తెలిపారు.

జోరుగా పింఛన్ల పంపిణీ



దేవరాపల్లిలో పింఛన్ సొమ్మును అందజేస్తున్న వలంటీర్ అనిమిరెడ్డి పోతురాజు



కె.కోటపాడు మండలం వారాడలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ గణేష్

దేవరాపల్లి/ కె.కోటపాడు: జిల్లాలో పింఛన్ల పంపిణీ మొదలైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఠంఛన్‌గా ఒకటో తేదీన తెల్లవారు జామున లబ్ధిదారులకు పింఛన్ అందేది. అయితే మార్చి 31, ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో లావాదేవీలు అప్‌డేట్ చేసేందుకు బ్యాంకులు, ఏటీఎంల్లో లావాదేవీలను నిలుపుదల చేయాలని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం కావడంతో బ్యాంకుల నుంచి నగదు డ్రాచేసే వీలులేకుండా పోయింది. 3వ తేదీన పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మంగళవారం నుంచి పంపిణీ జోరందుకుంటుందని అధికారులు చెబుతున్నారు.

రూ.16.15 లక్షల పింఛన్ల సొమ్ము చోరీ

పంచాయతీ కార్యదర్శిని బెదిరించి ఎత్తుకుపోయిన వైనం


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నవ్యశ్రీ

మాకవరపాలెం: పింఛన్ల పంపిణీ చేసేందుకు తీసుకెళ్తున్న రూ.16.15 లక్షలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయారు. దుంగలవానిపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. మండలంలోని జడ్.గంగవరం పంచాయతీ కార్యదర్శి నవ్యశ్రీ శెట్టిపాలెం సచివాలయ ఇన్‌చార్జి వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల పంపిణీ చేయాల్సిన పింఛన్ల నగదును సాయంత్రం మాకవరపాలెంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి ద్విచక్ర వాహనంపై శెట్టిపాలెం బయలుదేరారు. ఈ క్రమంలో దుంగలవానిపాలెం జంక్షన్ సమీపంలోకి వెళ్లేసరికి పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆమెను బెదిరించారు. బైక్‌పై నుంచి ఆమెను పక్కకు నెట్టేసి రూ.16.15 లక్షలు ఎత్తుకుపోయినట్టు సచివాలయ సిబ్బందితో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వ్యక్తి హెల్మెట్, మరొక వ్యక్తి ముఖానికి ముసుగు వేసుకుని ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు క్రైం బ్రాంచ్ ఎస్ఐ రమేష్ రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.

అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కలెక్టరేట్ స్పందనకు 189 అర్జీలు


స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ కల్పనాకుమారి

తుమ్మపాల: అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయనతోపాటు జేసీ కల్పనాకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనకు వచ్చిన ప్రతి ఫిర్యాదును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కారం చేయాలన్నారు. తిరస్కరిస్తున్న వాటికి స్పష్టమైన సమాధానం ఇవ్వాలన్నారు. ఏపీ సేవ పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తులపై సంబంధిత అధికారులు సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ వినతులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండల స్థాయిలో క్వాలిటీ డిస్పోజల్ పెరగాలన్నారు. ఈ వారం మొత్తం 189 అర్జీలు నమోదయ్యాయి. అత్యధికంగా రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉన్నాయి. డీఆర్వో పి.వెంకటరమణ స్పందన నమోదు కేంద్రం వద్ద దివ్యాంగులను, వృద్ధులను కలిసి వారి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు పెంచాలి..

దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు పెంచాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఉద్యోగాల్లో పది లోపు రోస్టర్ పాయింట్ తీసుకురావాలన్నారు. జీవో నంబరు 99 ద్వారా శారీరక దివ్యాంగులకు నోటిఫికేషన్ సవరణ చేయాలన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు.

జీవనాధారంగా మా గ్రామంలోనే భూమి ఇవ్వండి

ఇటీవల తన కుమారుడు హత్యకు గురైన నేపథ్యంలో నాకు జీవనాధారంగా 20 కిలోమీటర్ల దూరం గోపాలపట్నంలో కొండపోడు ప్రభుత్వం కేటాయించింది. ఇది సాగుకు అనుకూలంగా లేదని, మహిళగా నా పరిస్థితి అర్థం చేసుకుని మా గ్రామంలోనే సర్వే నెం.26-6, 49లో 6, 9, సీతారాంపురంలో 71-1లో ప్రభుత్వ భూమిని మంజూరు చేయాలని కలెక్టర్‌ను పాయకరావుపేట మండలం పీఎల్‌పురం గ్రామానికి చెందిన వి.మరియమ్మ కోరింది.

పౌల్ట్రీ ఏర్పాటుతో తీవ్ర ఇబ్బందులు

అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీ దుర్గానగర్ కాలనీ సమీపంలో పౌల్ట్రీ వ్యర్థాలను వేస్తున్నారని, తక్షణమే దాన్ని నిలిపివేయాలని సంబంధిత గ్రామస్తులు స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ విషయమై తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా పట్టించకోలేదని వాపోయారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని చర్యలు తీసుకోవాలని కోరారు.


కొండ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలంటూ నిరసన చేస్తున్న గ్రామస్తులు

ప్రభుత్వ భూమిలో అనధికార లేఅవుట్

అనకాపల్లి మండలం శంకరం సరిహద్దు రేబాక గ్రామ సర్వే నంబరు.99 కొండను చదును చేసి వేసిన అనధికార లేఅవుట్, భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని శంకరం గ్రామస్తులు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కొండను చదునుతోపాటు గ్రావెల్ తరలింపు, ప్లాట్‌ల విక్రయాలు చేస్తు భారీ భవన నిర్మాణాలపై కొంత కాలంగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని కలెక్టరేట్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆక్రమణదారులతో కుమ్మక్కై తప్పుడు ఎల్‌పీసీలు మంజూరు చేసిన రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్వే నంబర్లు 99, 98 కొండపై పూర్వకాలంగా ఉంటున్న మా పాకలను దౌర్జన్యంగా జేసీబీలతో తొలగించారని, ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారని రేబాక గ్రామస్తులు ఫిర్యాదు చేశారు.

అయినా సదరం ఇవ్వడం లేదు



గతేడాది ప్రమాదంలో రెండు కాళ్లు విరిగిపోయాయి. సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసి నాలుగు నెలలు కావస్తున్న అధికారులు మంజూరు చేయడం లేదని గొలుగొండ మండలం కేడీపేటకు చెందిన పీవీ రమణ వాపోయాడు. తన కుమారుడి సహాయంతో కలెక్టరేట్‌కు వచ్చి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సదరం సర్టిఫికెట్ లేకపోడవంతో వైఎస్సార్ బీమా రాలేదని, పింఛన్ మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎస్పీ స్పందనకు 22 అర్జీలు

అనకాపల్లి టౌన్: ఎస్పీ కార్యాలయంలో స్పందన కార్యక్రమానికి 22 అర్జీలు వచ్చినట్లు ఎస్పీ గౌతమి సాలి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీలదారుల సమస్యలను తెలుసుకుని, అప్పటికప్పుడే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు. చట్టపరిధిలోని సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూతగాదాలు, చీటింగ్ తదితర అర్జీలు ఎక్కువగా వచ్చినట్లు తెలిపారు.

ఇద్దరు నాయకులపై టీడీపీ వేటు

- రాజబాబు, నారాయణరావు సస్పెన్షన్
- అనితను వ్యతిరేకించడమే కారణమని ప్రచారం


సస్పెన్షన్‌కు గురయిన రాజబాబు, నారాయణరావు

నక్కపల్లి/పాయకరావుపేట: పాయకరావుపేటకు చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గొర్లె రాజబాబు, పట్టణశాఖ మాజీ అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇద్దరు టీడీపీ నాయకులు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున సస్పెండ్ చేసినట్టు ఆయన జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే అనిత, మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కొద్ది కాలం నుంచి ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. గంటా శ్రీనివాసరావు ఆదివారం నక్కపల్లి మండలం వేంపాడులో టీడీపీ నాయకుడు కల్లేపల్లి బాబ్జిరాజు ఇంటికి వచ్చారు. ఈ కార్యక్రమానికి అనితకు ఆహ్వానం లేదు. గంటాను ఎవరూ కలవడానికి వీల్లేదని అనిత వర్గం హుకుం జారీ చేసినట్టు సమాచారం.ఈ నేపథ్యంలో రాజబాబు, నారాయణరావు గంటాను కలిసారు. అలాగే ఈ నాయకులు ఇటీవల పాయకరావుపేటలో టీడీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగల పూడి అనిత ఫొటో వేయకపోవడం, గంటా శ్రీనివాసరావు ఫొటో వేయడం వంటి కారణాల వల్ల ఇద్దరినీ సస్పెండ్ చేసినట్టు తెలుస్తోంది. గత ఎన్నికల్లో అనితకు పాయకరావుపేట టికెట్ రాకుండా ఆమె అవినీతిని బహిరంగంగా విమర్శిస్తూ ఈ ఇద్దరూ ధర్నాలు, ర్యాలీలు చేశారు. దీంతో చంద్రబాబు పాయకరావుపేట టికెట్ అనితకు ఇవ్వలేదు. అప్పటి నుంచి అనిత వీరిపై గుర్రుగా ఉందని సమాచారం.

అసంపూర్తిగా చోడవరం కోర్టు భవనాల నిర్మాణం

పూర్తి చేయించాలని ఆర్‌అండ్‌బీ సీఈకి ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, బార్ అధ్యక్షుడు వినతి


ప్రభుత్వ విప్ ధర్మశ్రీతో కలసి చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బార్ అధ్యక్షుడు

చోడవరం రూరల్: స్థానిక కోర్టుల సముదాయంలో అసంపూర్తిగా నిలిచిపోయిన నూతన కోర్టు భవనాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం అమరావతిలో ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మాధవి సుకన్యను ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీతోపాటు బార్ అధ్యక్షుడు డేవిడ్ కలుసుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోనే పేరెన్నికగన్న చోడవరం కోర్టులో తొలి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఏర్పాటైందన్నారు. పురాతన కాలం నాటి ఇక్కడ భవనాలు శిథిలాస్థితికి చేరుకున్నాయని, ఇటీవల అదనపు జిల్లా కోర్టును బార్ అసోసియేషన్ కార్యాలయ భవనంలోకి మార్చాల్సి వచ్చిందని వాపోయారు. దీంతో నాలుగు కోర్టులకు శాశ్వత భవనాల ఆవశ్యకతను గుర్తించి నూతన భవనాల నిర్మాణాన్ని చేపట్టగా, అసంపూర్తిగా నిలిచిపోయాయని ఆమెకు వివరించారు. ఈ నేపథ్యంలో పూర్వపు కాంట్రాక్టర్‌ను మార్చి నూతనంగా టెండర్ పిలిచి తక్షణం నిర్మాణ పనులు పూర్తి చేయాలని విప్ కరణం ధర్మశ్రీ కోరారు. దీనిపై స్పందించిన సీఈ తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

లారీ ఢీకొని యువకుడి మృతి


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణారావు

మాకవరపాలెం: లారీ ఢీకొట్టడంతో మోటారు సైకిల్‌పై వెళ్తున్న యువకుడు మృతి చెందాడు. కశింకోట మండలం తాళ్లపాలెంకు చెందిన మేరపురెడ్డి సన్యాసిరావు(37) సోమవారం మాకవరపాలెం వైపు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో వెంకన్నపాలెం గ్రామ సమీపంలోకి వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు.

మద్యం మత్తులో కార్మికుడి హత్య

చింతపల్లి: గూడెంకొత్తవీధి మండలం పెదవలస పంచాయతీ చాపరాతిపాలెంలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులు చేస్తున్న ఇద్దరి కార్మికుల మధ్య ఆదివారం రాత్రి ఘర్షణ తలెత్తింది. దీంతో ముఖేష్ అనే కార్మికుడు సంతోష్ అటాష్‌ను గొడ్డలితో నరికి హతమార్చాడు. వీరు ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వచ్చి కొంతకాలంగా ఇక్కడ సెల్ టవర్ నిర్మాణ పనుల్లో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో వివాదం తలెత్తడంతో ఆగ్రహానికి గురై ముఖేష్ ఈ హత్య చేశాడు. అనంతరం అతడు సెల్ టవరుపై ఎక్కి కిందకు దిగేందుకు మొండికేశాడు. తోటి కార్మికులు నచ్చజెప్పి కిందకు రప్పించి చితకబాదారు. సంఘటనపై జీకేవీధి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లాయర్ మోసంపై ఫిర్యాదు


మాట్లాడుతున్న నాగరత్నం

అనకాపల్లి టౌన్: మీ ఆస్తులు కాపాడతానంటూ... మీ పేరిట ఆస్తులుంటే ప్రాణహాని... అంటూ ఓ మహిళను మోసం చేసిన లాయర్ వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానిక బారువారి వీధికి చెందిన చిన్న పిల్లల వైద్యుడు మదాబత్తుల ఉమామహేశ్వరరావు 2020లో కోవిడ్‌తో మృతి చెందాడు. అతడి భార్య నాగరత్నం ఒంటరిగా ఉంటోంది. పెద్ద కుమారుడు వీరప్రణీత్ ఉద్యోగరీత్యా, చిన్న కుమారుడు సాయి శ్రీశశాంక్ వైద్య విద్య కోసం విశాఖలో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను దొమ్మేటి రవితేజ అడ్వకేట్‌గా పరిచయం చేసుకున్నాడు. 'మీ ఆస్తులు కాపాడే బాధ్యత నాది. మీ పేరున పెద్దమొత్తంలో ఆస్తులుంటే ప్రాణహాని ఉంటుంది.' అని చెప్పి ఆమె ఆస్తులన్నీ తన పేరుపై రాయించుకున్నాడు. దాంతో మోసపోయినట్లు గుర్తించి, అతని సహచర అడ్వకేట్లు నాగార్జున, మురళిల వల్ల ప్రాణి ఉందని ఎస్పీ గౌతమి సాలికి సోమవారం బాధితురాలు ఫిర్యాదు చేసింది.

పక్కా ప్రణాళికతో అప్పన్న చందనోత్సవం

ఈవోకి కలెక్టర్ మల్లికార్జున సూచన


ఆలయ శిఖర దర్శనం చేసుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం : అప్పన్న చందనోత్సవాన్ని విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సింహాచలం ఈవో వి.త్రినాథరావుకు కలెక్టర్ మల్లికార్జున సూచించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం కలెక్టర్ దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో కలెక్టర్ పేరిట అర్చకులు పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున ఆలయ ఈవో త్రినాథరావుతో భేటీ అయ్యారు. ఈనెల 23న జరగనున్న చందనోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే నేపథ్యంలో ఎలాంటి సౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది చోటుచేసుకున్న కొన్ని ఇబ్బందులపై ఆయన ఈవోతో ప్రస్తావించారు. గత ఏడాది వీఐపీలకు దర్శన టికెట్లు ధరలు పెంచామని, ఈసారి కూడా ఆ పద్ధతే కొనసాగించాలన్నారు. గత ఏడాది సంతకాలు లేకుండానే డూప్లికేట్ టికెట్లు జారీచేశారన్న ఆరోపణలు వచ్చాయని, ఈసారి అలాంటి పరిస్థితి లేకుండా కంప్యూటరైజ్డ్ టికెట్లు అందుబాటులో తీసుకువచ్చేలా ఆలోచన చేయాలన్నారు.

తప్పిన పెను ప్రమాదం

- ముందు వెళ్తున్న టూరిస్ట్ బస్సును ఢీకొన్న మరో బస్సు
- చిలకలూరిపేట నుంచి విశాఖ వైపు వస్తున్న బస్సుకు ప్రమాదం
- ప్రయాణికులు సురక్షితం


ముందు బస్సును ఢీకొన్న బస్సు


స్వల్పంగా దెబ్బతిన్న ముందు బస్సు

అనకాపల్లి టౌన్: స్థానిక జాతీయ రహదారి ఉమ్మలాడ కూడలి వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, ప్రయాణికులు అందించిన వివరాలిలా ఉన్నాయి. చిలకలూరిపేటలో ఆదివారం రాత్రి 10 గంటలకు బయల్దేరిన రెండు ప్రైవేటు బస్సులు విశాఖ మీదుగా అరకు, బొర్రా, చాపరాయి తదితర పర్యాటక కేంద్రాలను సందర్శించేందుకు వెళ్తున్నట్లు ప్రయాణికులు తెలిపారు. అనకాపల్లి - విశాఖ జాతీయ రహదారిలో ముందు వెళ్తున్న లారీ నిలిచి పోవడంతో అదే రహదారిలో వెనుక వస్తున్న బస్సు డ్రైవర్ గమనించి బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న మరో బస్సు ఢీకొంది. ఈ ఘటనలో రెండు బస్సులు స్వల్పంగా దెబ్బతినప్పటికీ వాటిలో ప్రయాణిస్తున్న 95 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మరో రెండు ప్రైవేటు బస్సుల్లో పర్యాటక కేంద్రాలకు ప్రయాణికులు బయల్దేరి వెళ్లారు.

ఆటో ప్రమాదంలో అంగన్‌వాడీ ఆయా మృతి


నుజ్జయిన ఆటో


మృతురాలు గౌరమ్మ(ఫైల్)

వీఆర్‌పురం: దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త మృతి చెందింది. ఈ ఘటన మండల కేంద్రం రేఖపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివారల ప్రకారం పెదమట్టపల్లి పంచాయతీ గుర్రంపేట గ్రామానికి చెందిన చిచ్చడి గౌవరమ్మ (45) అదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా పనిచేస్తుంది. కుటుంబ సభ్యులతో కలిసి శ్రీరామగిరి గ్రామంలోని దొంగలదోపు ఉత్సవాన్ని వీక్షించేందుకు సోమవారం తెల్లవారు జామున అదే గ్రామానికి చెందిన బంధువు ఆటోలో వెళ్లారు. కాగా అక్కడ స్వామిని దర్శించుకొని ఇంటికి తిరిగి వెళుతున్న క్రమంలో రేఖపల్లి గ్రామ శివారు గోదులమ్మ గుడి వద్దకు చేరుకునే సరికి ఆటో అదుపుతప్పి రోడ్డుకు పక్కగా ఉన్న తాడిచెట్టును బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ పక్కగా కూర్చున్న గౌరమ్మ తల భాగం చీలిపోయి అక్కడికక్కడే మృతిచెందింది. అందులో ప్రయాణిస్తున్న మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. గౌరమ్మ భర్త సహదేవుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ టి.దుర్గాప్రసాద్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు చోడవరం క్రీడాకారులు

రాష్ట్ర స్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు


పతకాలతో క్రీడాకారులు

చోడవరం రూరల్: రాష్ట్ర స్థాయి బాడీ లిఫ్టింగ్ (బస్కీ) పోటీల్లో చోడవరం క్రీడాకారులు పతకాలు సాధించారు. 89, 60 కేజీల విభాగంలో ప్రథమ, తృతీయ స్థానాలలో నిలిచిన వీరు పంజాబ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని అనకాపల్లి జిల్లా బాడీ లిఫ్టింగ్ అసోసియేషన్ ఇన్‌చార్జి పుల్లేటి గణేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1న విశాఖపట్నంలోని వివేకానంద ఫంక్షన్ హాల్ రాష్ట్ర స్థాయి బాడీ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారన్నారు. ఇందులో 80 కేజీల విభాగంలో కె.మణికంత ప్రథమ స్థానాన్ని, 60 కేజీల విభాగంలో జి.యుగంధర్ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. ఈ పతకాలు సాధించిన మొట్టమొదటి క్రీడాకారులుగా నూతన జిల్లాలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఏపీ బాడీ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కిలాని గణేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చొక్కాకుల వెంకటరావు బహుమతులు అందజేసి అభినందించారు.

అధ్యాపకుల అనుచిత ప్రవర్తనపై విచారణ

తుమ్మపాల: అనకాపల్లి మండలం రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థినులపై అధ్యాపకుల అనుచిత ప్రవర్తనపై వస్తున్న దుమారంపై కలెక్టర్ ఆదేశాలతో స్త్రీశిశు సంక్షేమ శాఖ సీడీపీవో ప్రభావతి సోమవారం విచారణ చేపట్టారు. కళాశాలలో విద్యార్థినులను, అధ్యాపకులను దాదాపు రెండు గంటలకు పైగా విచారణ చేశారు. మంగళవారం విచారణ చేపట్టి పూర్తి వివరాలతో నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు ఆమె తెలిపారు. ఇక్కడ ప్రిన్సిపాల్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక బృందాన్ని నియమించారు. విద్యార్థినుల పేర్లు బయట పడకుండా వారి నుంచి చిట్టీల రూపంలో సమాచారం సేకరిస్తున్నారు. ఈ సమాచారాన్ని కళాశాల ఆర్జేడీకి నివేదిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

ఐసీడీఎస్ కేంద్రానికి బాలామృతం ప్యాకెట్లు



కశింకోట కేంద్రం వద్ద లారీ నుంచి దింపుతున్న బాలామృతం ప్యాకెట్ల బస్తాలు

కశింకోట: కశింకోటలోని ఐసీడీఎస్ కేంద్రానికి సోమవారం బాలామృతం ప్యాకెట్ల బస్తాలు చేరాయి. వీటిని తయారు చేసే తెలంగాణ రాష్ట్రం నుంచి లారీలో తీసుకొచ్చారు. కూలీలు దింపి ఇక్కడ గదిలో నిల్వ చేశారు. వీటిని కేంద్రం పరిధిలో ఉన్న కశింకోట, అనకాపల్లి గ్రామీణం, మునగపాక మండలాలకు చెందిన 234 అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందించనున్నారు. రెండున్నర కిలోల ప్యాకెట్‌ను నెలకు ఒక్కో చిన్నారికి అందిస్తారు. 7 నెలల వయసు నుంచి 3 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లలకు అన్ని రకాల పోషక విలువలు కలిగిన బాలామృతాన్ని అంబలి, సిరలక్, రొట్టెలు, దోసెలు తదితర వివిధ రూపాల్లో రోజులో మూడు పూటలు వంద గ్రాముల వంతున అందివ్వాల్సి ఉంటుందని కేంద్రం ప్రతినిధులు తెలిపారు.

కశింకోటలో పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుకు పింఛన్ సొమ్ము అందిస్తున్న గ్రామ వలంటీర్ లిఖిత

కశింకోట: కశింకోటలో సోమవారం సాయంత్రం గ్రామ వలంటీర్లు పెన్షన్ల సొమ్ము పంపిణీ చేశారు. బ్యాంకు నుంచి నగదు అందడంతో వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు పింఛన్ల పంపిణీ చేపట్టారు. మండలంలో మొత్తం 10,446 మందికి సుమారు రూ.2.82 కోట్ల పింఛన్లు అందించాల్సి ఉంది. ప్రతి నెలా 1న అందించే పింఛన్ల పంపిణీ ఈ నెల సాంకేతిక కారణాల వల్ల రెండు రోజులు ఆలస్యమైంది. ఈ విషయాన్ని ముందుగానే ప్రకటించారు. పింఛన్ సొమ్ము అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకు నుంచి నగదు రావడం ఆలస్యమైనందున మండలంలోని ఇతర గ్రామాల్లో మంగళవారం నుంచి పింఛన్ల సొమ్ము పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 5,055 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,790	4,300
మొదటి రకం	3,880	4,160
రెండో రకం	3,400	4,010
మూడోరకం	3,050	3,390

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి టౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 84 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-32 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-45 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్యను 98484 18400 నంబర్లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి టౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 421 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 94411 08144 నంబర్లో సంప్రదించవచ్చు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

- గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు
- ఎగ్జామ్ ముగిసే వరకు నిరీక్షించిన తల్లిదండ్రులు



సెయింట్ జాన్స్ స్కూల్ వద్ద పిల్లల కోసం చెట్ల కింద నిరీక్షిస్తున్న తల్లిదండ్రులు



కశింకోటలో ఉత్సాహంగా తెలుగు పరీక్షకు హాజరైన టెన్త్ విద్యార్థులు



కశింకోట డీపీఎన్ హైస్కూల్ వద్ద అదనపు ఎస్‌ఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు



డీపీఎన్ హైస్కూల్‌లో మరో విద్యార్థి సాయంతో పరీక్ష రాసిన అగ్గాల భానుతేజ



జీవీఎంసీ పట్టణ బాలికోన్నత హైస్కూల్ వద్ద పరీక్ష రాసేందుకు హాజరైన విద్యార్థులు



గవరపాలెంలో పరీక్ష రాసి బయటకొస్తున్న పదో తరగతి విద్యార్థులు

కశింకోట: పదో తరగతి ఫైనల్ పరీక్షలు సోమవారం ప్రశాంతమైన వాతావరణంలో ప్రారంభమయ్యాయి. మండలంలోని ఏడు కేంద్రాల్లో 1,190 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా.. 9 మంది గైర్హాజరయ్యారు. గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉత్సాహంగా చేరుకున్నారు. హాల్ టికెట్ల నంబర్ల ప్రకారం తమకు కేటాయించిన గదులను గుర్తించి ప్రవేశించారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరిగింది. ఈ సమయంలో పరీక్షా కేంద్రాల్లోకి ఇతరులను, సిబ్బంది, అధికారుల సహా ఎవరి సెల్‌ఫోన్లను అనుమతించ లేదు. కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ హైస్కూల్, బాలికల హైస్కూల్, సెయింట్ జాన్స్ హైస్కూలు, తాళ్లపాలెంలోని జెడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాల, నరసింగబిల్లి, కన్నూరుపాలెం హైస్కూళ్లలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

సహాయకులతో పరీక్ష రాసిన ఆరుగురు దివ్యాంగులు

ప్రత్యేక అవసరాలు గల ఆరుగురు విద్యార్థులు నిబంధనల మేరకు కేటాయించిన 9వ తరగతి విద్యార్థుల సహకారంతో పరీక్షలు రాశారు. వీరికి పరీక్ష కేంద్రాల్లో ప్రత్యేకంగా గదులను కేటాయించారు. కశింకోటకు చెందిన గొన్నాబత్తుల పవన్, కాము మణికంఠ, ఉరికిటి జగదీష్, బయ్యవరానికి చెందిన పండా అపర్ణ సెయింట్ జాన్స్ స్కూల్‌లో.. బయ్యవరానికి చెందిన అగ్గాల భానుతేజ కశింకోట డీపీఎన్ హైస్కూల్‌లో.. తాళ్లపాలెంకు చెందిన దిబ్బడి పవన్ అక్కడి బాలికల గురుకుల పాఠశాలలోను పరీక్షలు రాశారు. విద్యార్థులను తీసుకొచ్చిన తల్లిదండ్రులు పరీక్ష పూర్తయ్యే వరకు కేంద్రాల వద్ద బయట చెట్ల కింద, ఇతర ప్రాంతాల్లో నిరీక్షించారు. ఎంఈవో కె.చిట్టిబాబు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు. వాటి వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ విజయభాస్కర్ కశింకోటలోని కేంద్రాలను పరిశీలించారు. పోలీసు బందోబస్తు, పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. అదనపు ఎస్‌ఐ జె.నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

1,900 మంది హాజరు

అనకాపల్లిటౌన్: పట్టణ, మండలంలో 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. మొత్తం 13 పరీక్ష కేంద్రాల్లో 1,900 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఓపెన్ టెన్త్ విద్యార్థులకు గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. 209 మందికి గాను 198 మంది పరీక్షకు హాజరు కాగా.. 11 మంది గైర్హాజరయ్యారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలకు మండలంలో కొత్తూరు ఏఎంఏ హైస్కూల్, గవరపాలెం బాలుర హైస్కూళ్లలో రెండు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 430 మంది అభ్యర్థులకు 407 మంది పరీక్షకు హాజరు కాగా 23 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల పరీక్ష నిర్వహించగా ఓపెన్ టెన్త్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ దాడి మోహనరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో ఎక్కడా ఎటువంటి మాస్‌కాపియింగ్ జరగకుండా నిఘానేత్రంలో పరీక్షలు జరిగాయి.

టెన్త్ విద్యార్థులకు ఆటో సదుపాయం

- ఎంపీటీసీ కో–ఆప్షన్ సభ్యుడి ఉదారత



అప్పలరాజు సమకూర్చిన ఆటోల ద్వారా టెన్త్ పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు

అనకాపల్లి రూరల్: మండలంలోని కొండుపాలేనికి చెందిన మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు ఇబ్బందులు పడకూడదన్న సదుద్దేశంతో ఆటో సదుపాయం కల్పించి తన ఉదారత చాటుకున్నారు. ఎంపీటీసీ కో–ఆప్షన్ సభ్యుడు బోండా అప్పలరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బోండా ఉమా తమ సొంత నిధులతో టెన్త్ విద్యార్థుల కోసం ఆటోలను సమకూర్చారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్న లక్ష్యంతో ఈ గ్రామానికి చెందిన టెన్త్ విద్యార్థుల కోసం రెండు ఆటోలను పరీక్షలు ముగిసే వరకూ ఏర్పాటు చేశారు. సోమవారం టెన్త్ విద్యార్థులు అప్పలరాజు సమకూర్చిన ఆటోల ద్వారా పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యా శాఖ అధికారులు నిమిషం ఆలస్యమైనా పదో తరగతి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించేది లేదని నిబంధన పెట్టారు. విద్యార్థులు పరీక్షలు రాసేటప్పుడు ఎటువంటి ఒత్తిడి ఉండకూడదని, పరీక్షా కేంద్రానికి ప్రశాంతంగా వెళ్లేందుకు ఈ సదుపాయం కల్పించామని అప్పలరాజు చెప్పారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.

దుర్గమాంబ పండగ నేడు

సబ్బవరం: మండలంలోని టెక్కలిపాలెంలో కొలువైన దుర్గమాంబ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈమేరకు అన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సోమవారం జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా సాగాయి.

వైఎస్సార్‌సీపీ విజయానికి క్షేత్రస్థాయి కృషి



సచివాలయ కన్వీనర్లకు కిట్లు అందజేస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ విజయం కోసం గ్రామీణ స్థాయి నుంచి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ పిలుపునిచ్చారు. రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన సోమవారం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో 'జగనన్నే మా భవిష్యత్తు' అనే కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 7న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగేళ్ల పాలనలో 95 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. జీవీఎంసీ సచివాలయాల ఇన్‌చార్జి కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ ఒక్కో సచివాలయానికి ముగ్గురు కన్వీనర్లను నియమించినట్లు తెలిపారు. ప్రతి గృహాన్ని వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు నిత్యం సందర్శిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు.

నేటి నుంచి కన్వీనర్లు, గృహసారథుల పర్యటన

ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మండలంలోని 32 పంచాయతీల్లో 26 సచివాలయాలు ఉన్నాయని, మంగళవారం నుంచి కన్వీనర్లు, గృహసారథులు పర్యటించాలని కోరారు. ఈ నెల 7 నుంచి 14 వరకూ డోర్ టూ డోర్ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహిస్తూ.. బ్యాడ్జీలు, కరపత్రాలు, మొబైల్ స్టిక్కర్లు, డోర్ స్టిక్కర్లు అందజేయాలని చెప్పారు. ప్రతీ గృహానికి వెళ్లిన కన్వీనర్లు గృహ యజమాని మొబైల్ నుంచి 82960 82960 నంబర్‌కు మిస్డ్ కాల్ చేయాలని సూచించారు. అనంతరం కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్తు కిట్లను దిలీప్‌కుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్లు ఎ.వి.రత్నకుమారి, మునూరు శ్రీనివాసరావు, మండల పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం.శోభ, పార్టీ నాయకులు కుండల రామకృష్ణ, పలకా సత్యనారాయణ, ఉగ్గిన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆసరా' చెక్కుల పంపిణీ

అనకాపల్లిటౌన్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో మంగళవారం ఉదయం 10 గంటలకు జోన్ పరిధిలో 3వ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు సోమవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతున్నట్లు చెప్పారు. 80 నుంచి 84 వార్డుల పరిధిలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. కార్పొరేటర్లు, పార్టీ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కశింకోట: మండలంలోని బయ్యవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ(ఆపరేషన్స్) కె.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అభివృద్ధిని అడ్డుకోవడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న మందపాటి జానకీరామరాజు

అనకాపల్లిటౌన్: నియోజకవర్గంలో ప్రజలందరి సహకారంతో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సుపరిపాలన సాగిస్తుంటే కొంత మంది టీడీపీ నేతలు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అన్నారు. అనకాపల్లి కేంద్రంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తుంటే గత ప్రభుత్వ పాలకులు అడ్డుకోవడంతో మాకవరపాలెం మండలం భోయినపాలేనికి తరలించారని గుర్తుచేశారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీ20 పారిశ్రామిక సదస్సు విజయవంతం కావడంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ నేతలకు చెమటలు పడుతున్నాయన్నారు. పట్టణ పరిధిలో సుమారుగా 1,500 గృహాలు 22ఏలో గత పాలకులు చూపించి ఆయా ప్రాంతాల ప్రజలను ఇబ్బందులకు గురిచేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఈ సమస్యను పరిష్కరించిందని చెప్పారు. పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ మాట్లాడుతూ టీడీపీ నేతలు పీలా గోవింద సత్యనారాయణ, బుద్ధ నాగజగదీష్‌లు ప్రభుత్వంపై బురద జల్లడమే తప్ప.. ప్రజా సమస్యలను ఏనాడు పట్టించుకోలేదన్నారు. జీ20 సదస్సులో రాష్ట్రానికి రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకే దక్కిందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ టీడీపీ పాలనలో మూతపడిన తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో సీఎం జగన్ ఫుడ్‌ప్రాసెసింగ్ ఏర్పాటు చేసి ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. మండలంలోని కోడూరులో 120 ఎకరాల్లో ఏపీఐసీసీ ఏర్పాటు చేసి వివిధ కంపెనీల స్థాపనకు కృషి చేస్తూ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం



బాబూరావుకు విరాళం నగదు అందిస్తున్న బెనర్జీ దంపతులు

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ, వేంకటేశ్వర స్వామి ఆలయ ధ్వజస్తంభ నిర్మాణానికి వైద్యుడు బెనర్జీ దంపతులు రూ.2 లక్షల విరాళం అందించారు. ఆ మొత్తాన్ని సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ కొణతాల బాబూరావుకు వారు అందజేశారు. ఈ సందర్భంగా బెనర్జీకి బాబూరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆయా, స్వీపర్లకు కనీస వేతనమివ్వాలి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందిస్తున్న కోన లక్ష్మణ

అనకాపల్లిటౌన్: ప్రభుత్వ స్కూళ్లలో పని చేస్తున్న ఆయాలు, స్వీపర్లకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. సర్కారు బడుల్లో వీరు తలకు మించిన భారం మోస్తూ విధులు నిర్వహిస్తున్నారని, వారి సమస్యలపై ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

'ఆసరా' సభను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: కశింకోటలో ఈ నెల 5న నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా కార్యక్రమ సభకు గ్రామాల నుంచి స్వయం సహాయక సంఘాల మహిళలు హాజరై విజయవంతం చేయాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. కశింకోట మండల పరిషత్ కార్యాలయంలో ఆసరా కార్యక్రమ సభ నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలతో సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసరా సభకు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు. దీని దృష్ట్యా ప్రతి స్వయం సహాయక సంఘం నుంచి కనీసం ఐదుగురు సభ్యులు తమ సొంత ఖర్చులతో సభకు హాజరు కావాలన్నారు. మండలంలోని 1,537 స్వయం సహాయక సంఘాల్లో 16,830 మంది సభ్యులకు రూ.13.27 కోట్ల వంతున మూడు విడతలుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ సభకు హాజరయ్యే స్వయం సహాయక సంఘాల సభ్యులు వేసవి తాపానికి గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఏరియా సమన్వయకర్త ధర్మారావు మాట్లాడుతూ సభ విజయవంతం చేయడానికి గ్రామ స్థాయి నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్ల సహకారం తీసుకోవాలన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, వైఎస్సార్ కాంతి పథకం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, అచ్చెర్ల సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

6న ఆలయాల్లో సామూహిక హారతి

- అదే రోజు హనుమాన్ శోభాయాత్ర



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమణమ్మ తదితరులు

సబ్బవరం: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలు విస్తృతం చేయాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం మండల సమావేశం నిర్వహించారు.ఈ నెల 6వ తేదీన సామూహిక హారతి కార్యక్రమం,ధార్మిక జట్ల నిర్మాణం,మండల కమిటీ ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించారు. వారం వారం దేవాలయం కేంద్రంగా భజనలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ నెల 9వ తేదీన అనకాపల్లి శ్రీసూర్యనారాయణ దేవాలయం నుంచి శారదా బ్రిడ్జి వరకూ హనుమాన్ శోభాయాత్ర జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన గోడపత్రికను సబ్బవరం మూడు రోడ్ల కూడలిలోని హనుమాన్ ఆలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల మహిళా కన్వీనర్ పెద్దాడ రమణమ్మ,పి. వరలక్ష్మి, సి. వరలక్ష్మి, ఎస్. రవణతల్లి,అనకాపల్లి కన్వీనర్ వెంకటరమణ,వి. వంశీ కృష్ణ, పరవాడ డివిజన్ ధర్మప్రచారక్ వెన్నల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమాంబ ఉత్సవాలకు ఏర్పాట్లు

పరవాడ: మండలంలోని ఈ. బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో కొలువుదీరిన దుర్గమాంబ గ్రామ దేవత పండగను ఈ నెల 6న వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం ఉదయం నుంచి భక్తులు గ్రామ దేవత దుర్గమాంబను దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు.

ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభం



ప్రారంభోత్సవంలో పాల్గొన్న అమ్మాజీ, మహిళలు

అనకాపల్లిటౌన్: కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 40 రోజుల ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర ఇన్‌చార్జి అమ్మాజీ సూచించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా శ్రీసత్యసాయిబాబా మందిరం వద్ద సోమవారం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి శిక్షణలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారులు శ్రీకృష్ణరాజు, అన్నం రాజశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి తదితరులు

పరవాడ: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు సక్రమంగా వినియోగించుకోవాలని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సబ్బవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పోర్టిఫైడ్ రైస్‌ను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రాగులు, జొన్నలు వంటి చిరుధాన్యాలతో చేసిన వంటకాలను తిలకించారు. కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యవంతమైన పిల్లలతో వెల్‌బేబీషో నిర్వహించారు. సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, నాయకులు పైల అప్పలనాయుడు, చీపురుపల్లి సన్యాసిరావు, ఏఎన్ఎంలు రత్నం, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు యువత ముందుకు రావాలని ఎంపీ సత్యవతి పిలుపునిచ్చారు. తన కార్యాలయం ముందు సోమవారం చలివేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ వేసవిలో రహదారులపై పయనిస్తున్న వారికి చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వివేకానంద చారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.